మాయమవుతున్న మైనర్ కాల్వలు

● సాగునీరు అందక రైతుల ఇబ్బందులు
● తగ్గిపోతున్న సాగు విస్తీర్ణం

మిర్యాలగూడ: పొలాలకు సాఫీగా నీరందేందుకు ఎన్ఎస్పీ అధికారులు నాగార్జునసాగర్ ఆయకట్టు కింద మెయిన్, మేజర్, మైనర్ కాల్వలను తవ్వి రైతుల పంట పొలాలకు అనుసంధానం చేశారు. గతంలో ఆ పంట పొలాలకు సాఫీగా నీరందేది. ప్రస్తుతం ప్లాట్లు, రియల్ ఎస్టేట్ రావడంతో కాల్వలను సైతం మలుపుకోవడంతో పంట పొలాలకు నీరందడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజురోజుకు కాల్వల ఆక్రమణలతో చివరి భూములకు నీరందడం లేదు. దీంతో రైతులు తమ భూములను ఖాళీగా వదులుతుండడంతో బీడుగా మారుతున్నాయి. మేజర్ - 1 ఆర్1 మైనర్ కింద సుమారు 600 ఎకరాల్లో రైతులు వరి సాగు చేపడుతున్నారు. దిగువన ఉన్న రైతులు నాట్లు వేసుకుని సాగుకు సిద్ధమయ్యారు. మధ్యలో 200 ఎకరాల్లో నాట్లు పూర్తి కాలేదు. చిల్లాపురం మేజర్ నుంచి ఆర్1 మైనర్ ద్వారా సుమారు 6వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. దీని ద్వారా చిల్లాపురం, పొట్టిగానితండా, దుబ్బతండా, శ్రీనివాస్‌నగర్, సామ్యాతండా గ్రామాలకు సంబంధించిన రైతులకు సాగునీరు ఆధారం కలిగిన మైనర్ కాల్వ చివరి వ్యవసాయ భూముల వద్ద ఆక్రమణలకు నోచుకోవడంతో కింది పొలాలకు నీరందడం లేదు.


చింతపల్లి శివారులో గల మైనర్ కాల్వ


చిల్లాపురం వద్ద ఆక్రమణకు గురైన పిల్ల కాల్వ

కాల్వలు పారక..

ఆర్1 మైనర్ నుంచి రైతులకు అవసరానికి మించిన సాగునీరు కిందకు ప్రవహించి తుంగపాడు బందంలోకి వెళ్లేలా పిల్ల కాల్వలు ఉన్నాయి. కొన్నేళ్ల క్రితం కొందరు రైతులు కాల్వలను తమ వ్యవసాయ భూముల్లో కలుపుకోవడంతో నీటి ప్రవాహం నిలిచిపోయింది. పంట కాల్వలను పరిరక్షించాల్సిన ఎన్ఎస్పీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో ఉన్న కాల్వలు అన్యాక్రాంతమవుతున్నాయని, కాల్వలు పారక సాగు చేపట్టలేని దుస్థితి ఏర్పడిందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

గుర్రంపోడు: రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు లబ్ధిదారుల ఎంపికను పూర్తి పారదర్శకంగా చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. బుధవారం గుర్రంపోడులోని ఎంపీడీఓ కార్యాలయంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. రైతు భరోసా కింద భూభారతిలోని డేటా మొత్తం మండల స్థాయిలో వ్యవసాయశాఖాధికారి , తహసీల్దార్లకు హార్డ్ కాపీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 21 నుంచి 24 వరకు జరిగే గ్రామ సభల్లో చదివి వినిపించి అర్హులైన వారి జాబితాను రూపొందించాలని అన్నారు. అర్హతలు గల వారికి ఈ నెల 26న రేషన్ కార్డులు జారీ చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో చండూరు ఆర్డీఓ శ్రీదేవి, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ కిరణ్, ఎంపీడీఓ శైలజ పాల్గొన్నారు.


ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిర్లక్ష్యం చేయొద్దు

త్రిపురారం: విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని నిడమనూరు మండల ప్రత్యేక అధికారి కృష్ణవేణి, త్రిపురారం ప్రత్యేక అధికారి లీల అన్నారు. మంగళవారం నిడమనూరు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం, త్రిపురారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణ అధికారులకు పథకాలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ వెంకటేశం, త్రిపురారం ఎంపీడీఓ విజయ కుమారి, తహసీల్దార్ గాజుల ప్రమీల, ఎంఈఓ రవి నాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దుస్తుల పంపిణీ


క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సాయికుమార్

పెద్దవూర: మండలంలోని పోతునూరు గ్రామానికి చెందిన శివరామ యూత్ కబడ్డీ క్రీడాకారులకు మంగళవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రేపాకుల సాయికుమార్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడ అయిన కబడ్డీకి పూర్వ వైభవం తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాదుస్తుల దాత చెరుకుపల్లి లక్ష్మీగోవర్ధన్‌ను సత్కరించారు.

క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలి


క్రికెట్ కిట్ అందజేస్తున్న దిలీప్‌రెడ్డి

పెద్దవూర: యువత క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని తిరుమలగిరి సాగర్ మాజీ వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి అన్నారు. మంగళవారం పెద్దవూర మండలంలోని పొల్తీతండా, మర్రిపురి గ్రామాల యువకులకు బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి సమకూర్చిన క్రికెట్ కిట్‌లను దిలీప్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రఘురాం, రమేష్, హనుమ, శివ రాంబాబు, సంతోష్, మణి, రంగా, సాయి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ నాయకులు

మిర్యాలగూడ అర్బన్: ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ నూతన డైరీని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. యూనియన్ డివిజన్ కార్యదర్శి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు సురేష్‌కుమార్, అమర్, కర్ణాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కొండల్, పాష, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజ

పెద్దవూర: మండలంలోని బట్టుగూడెం గ్రామంలో ఉన్న అయ్యప్ప దేవాలయంలో మంగళవారం అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సూరభట్ల అనంతరామశర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం చేసి, కుంకుమ, చందనం, భస్మాభిషేకం నిర్వహించారు. విగ్రహం ఎదుట ఉన్న పద్దెనిమిది మెట్లను పూలు, పండ్లతో అలంకరించి ప్రత్యేక పూజలు చేసి, పడిపూజ నిర్వహించారు. అనంతరం జ్యోతి వెలిగించారు.

పేలిన గ్యాస్ సిలిండర్

కొండమల్లేపల్లి: ఇంట్లో వంట చేసేందుకు గ్యాస్ సిలిండర్ ఆన్ చేస్తుండగా పేలింది. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలం గుర్రపుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని పన్నితండాలో బుధవారం జరిగింది. పన్నితండాకు చెందిన రమావత్ రాజు ఇంట్లో కుటుంబ సభ్యులు వంట చేసే క్రమంలో గ్యాస్ పొయ్యిని వెలిగించగా.. ఒక్కసారిగా సిలిండర్ పేలి మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.2లక్షల విలువ చేసే వస్తువులు, రూ.34వేల నగదు కాలిపోయినట్లు బాధితుడు రాజు తెలిపాడు.

అయ్యప్ప ఆలయంలో మకర జ్యోతి దర్శన పూజ


ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మిర్యాలగూడ: పట్టణంలోని అశోక్‌నగర్ అయ్యప్పస్వామి దేవాలయంలో మకర జ్యోతి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మకర జ్యోతి దర్శన భాగ్యాన్ని పట్టణవాసులకు కల్పించినట్లు ఆలయ శాశ్వత చైర్మన్ ముక్కపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గురుస్వాములు, అయ్యప్ప దీక్ష స్వాములు పాల్గొన్నారు.

పథకాలు అర్హులకు అందేలా చూడాలి


అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


ఆమనగల్లులో మన ఊరు - మన ఎమ్మెల్యే పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలు అర్హులకు అందే విధంగా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ స్థాయి వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26న నాలుగు సంక్షేమ పథకాలు అమలు చేయనున్నామని తెలిపారు. రేషన్‌కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకుగాను గ్రామ సభల ద్వారా అర్హులను ఎంపిక చేసి అందించాలన్నారు. అందుకుగాను అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, తహసీల్దార్ హరిబాబు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయం

వేములపల్లి: సబ్బండ వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం వేములపల్లి మండలంలోని ఆమనగల్లు గ్రామంలో గల శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అర్చకులు రెంటాల సతీష్‌శర్మ ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మన ఊరు - మన ఎమ్మెల్యే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను గడపగడపకు తీసుకెళ్లే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలోని పల్లెల రూపురేఖలను మారుస్తానన్నారు. ఆమనగల్లు, లక్ష్మీదేవిగూడెం గ్రామాల్లోని 15మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, పీసీసీ సభ్యులు చిరుమర్రి కృష్ణయ్య, జిల్లా నాయకులు స్కైలాబ్‌నాయక్, గాయం ఉపేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టల కృపయ్య, సీఐ వీరబాబు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐ స్పందనరెడ్డి, నాయకులు వల్లంపట్ల ప్రవీణ్, పిల్లల సందీప్, దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, వల్లంపట్ల అబ్రహం, కోల సైదులు, పెరుమాండ్ల నగేష్, పెరుమాండ్ల కవిరాజు పాల్గొన్నారు.

నాలుగు పథకాల అమలుకు కార్యాచరణ పూర్తి

● సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

మిర్యాలగూడ: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి అమలు చేయనున్న నాలుగు కొత్త పథకాలకు అవసరమైన కార్యాచరణ పూర్తి చేసినట్లు సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ తెలిపారు. బుధవారం సాయంత్రం మిర్యాలగూడలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత ఇందిరమ్మ ఇళ్ల కింద 1.14లక్షల దరఖాస్తులను అర్హతగా గుర్తించామని, ఇందులో వితంతువులు, వికలాంగులు, ఇతర నిబంధనలకు అనుగుణంగా ప్రాధాన్యతనిచ్చి అర్హులను గుర్తిస్తామన్నారు. అర్హుల జాబితాలను గ్రామ సభ ముందు పెట్టి ప్రజల ఆమోదం తెలిపిన తరువాత అర్హులుగా ప్రకటిస్తామన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమి లేని వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12వేల ఆర్థికసాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు పొంది ఉండి గత ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజుల పనిదినాలను కుటుంబంలో ఒకరైనా పనిచేసి ఉండాలని, వారికి మాత్రమే ఈ పథకం కింద అర్హులుగా గుర్తిస్తామన్నారు. వీరి జాబితా కూడా గ్రామ సభ ముందు ఉంచి లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. నేటి నుంచి 20వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరుగుతుందని, 21 నుంచి 24వ రకు గ్రామసభల ద్వారా పథకానికి అర్హులను గుర్తించి లబ్ధిదారులుగా ఎంపిక చేస్తామన్నారు. తెల్లరేషన్ కార్డుల జారీ విషయంలో ఇప్పటికే ఇంటింటి సర్వే పూర్తయిందని జిల్లా వ్యాప్తంగా 30వేల దరఖాస్తులు ఉన్నాయని, డివిజన్‌లో 8వేల దరఖాస్తులు ఉంటాయని చెప్పారు.


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

దరఖాస్తులకు నేడు చివరి అవకాశం

దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో ఇళ్లు, భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉద్యోగాలు పొందేందుకు గురువారం వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ తెలిపారు. 133 మంది ఇళ్లు కోల్పోయినట్లు గుర్తించామని, ఇందులో 116 మంది పేర్లతో కూడిన జాబితాను ఉద్యోగాల కోసం తెలంగాణ జెన్‌కో బోర్డుకు పంపినట్లు పేర్కొన్నారు. పవర్‌ప్లాంట్‌లో భూములు కోల్పోయిన కుటుంబాలు 525 ఉన్నాయని, ఇందులో 400 మంది కుటుంబ సభ్యులు వారసత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకున్నారని, మరో 125 మంది కుటుంబసభ్యుల పేర్లు ఇప్పటివరకు రాలేదన్నారు. మిగిలిన వారు గురువారం నాటికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ హరిబాబు తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మిర్యాలగూడ: పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నాగులపాటి నరసింహారావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అతడితో కలిసి పదో తరగతి చదువుకున్న చిన్ననాటి స్నేహితులు బుధవారం నరసింహ కుటుంబసభ్యులను పరామర్శించారు. రూ.1.25లక్షల ఎల్ఐసీ బాండ్‌తోపాటు నిత్యావసర సరుకులు అందజేశారు. వారిలో ప్రభాకర్, లోకేష్, ప్రకాశ్, నాగేందర్, సంతోష్, విజయ్, ప్రవీణ్, పరమేష్, శ్రీనివాస్ ఉన్నారు.


బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

వైభవంగా గోదాదేవి కల్యాణం

హాలియా: ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా హాలియా పట్టణంలోని స్వయంభూ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం గోదాదేవి కల్యాణం నిర్వహించారు. పీత వెంకటేశ్వరరాజు(విల్లు రాజు) సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రుత్వికులు గోవర్ధనా శ్రీరామాచార్యులు, స్థానాచార్యులు గోవర్ధన రాఘవాచార్యులు, ఈత వెంకటేశ్వరరాజు, పద్మజ, మనాది రవీందర్, శ్రీలత, కంచర్ల గురువారెడ్డి, చంద్రకళ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.14హెచ్ఎల్ఎ701 బొర్రాయిపాలెంలో గోదాదేవి కల్యాణం సందర్భంగా పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బిట్టు వసంత దంపతులు

త్రిపురారం: మండలంలోని బొర్రాయిపాలెం గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం గోదాదేవి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అర్చకులు సంజయ్ త్రిపాఠి, పురోహితులు టయ్యాల ఫణికుమారచార్యులు ఈ కల్యాణం జరిపించారు. ఆలయ చైర్మన్ బిట్టు వసంత రవి కుమార్‌లు పుస్తె, మెట్టెలు, పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో అన్న ప్రసాద వితరణ దాత గుంటిపల్లి వెంకట్‌రెడ్డి, పేలపోలు సత్యనారాయణ, కొనకంచి వెంకటేశ్వర్లు, మెండికత్తి గురువయ్య, ధనావత్ నిమానాయక్, గార్లపాటి వెంకట్ రెడ్డి, సారెడ్డి సైదిరెడ్డి, కాంతారెడ్డి, ఇండ్ల ఏడుకొండలు, అంబటి నాగిరెడ్డి, మాదా వెంకటేశ్వర్లు, ధనలక్ష్మి, హర్యా నాయక్, రాము నాయక్, నక్క సైదయ్య, మలికంటి సైదయ్య పాల్గొన్నారు.


హాలియాలో గోదాదేవి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

● ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

దేవరకొండ, చింతపల్లి: దేవరకొండ నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆకాంక్షించారు. చింతపల్లి మండల పరిధిలోని వింజమూరు గ్రామపంచాయతీ బట్టుగూడెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, నాయిని జమున మాధవరెడ్డి, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, మాజీ ఎంపీపీ భవాని పవన్ కుమార్, రవి నాయక్, పార్టీ మండల అధ్యక్షులు నాగభూషణం, మాజీ సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి, మాజీ ఎంపీటీసీ సదానందం పాల్గొన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ దేవరకొండ మండల పరిధిలోని ఇద్దంపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.


దేవరకొండ: ఇద్దంపల్లిలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

అమ్మనాన్న ఫౌండేషన్ సేవలు అభినందనీయం


బంకాపురంలో విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

త్రిపురారం: నిరుపేద కుటుంబాలకు అమ్మ నాన్న ఫౌండేషన్ ద్వారా అందించే సేవలు అభినందనీయమని జిల్లా మిల్లర్స్ గౌరవ అధ్యక్షుడు చిట్టిప్రోలు యాదగిరి అన్నారు. బుధవారం నిడమనూరు మండలంలోని బంకాపురం గ్రామంలో ఒంటరి మహిళల పిల్లల చదువుల కోసం అమ్మ నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆర్థికసాయం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉన్నం చిన్నవెంకటేశ్వర్లు, వీరమళ్ల శ్రీనివాస్, పాంపాటి యాదగిరి, కుక్కడపు రమేష్, శ్రీనివాస రావు, మురళీధర్ రావు, రాజు, వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేష్, లింగయ్య, సుబ్బరాజు, రామయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ, రాంబాబు, కోటి, రవి పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు

పెద్దవూర: సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి ఇంటి ఎదుట రకరకాల రంగులతో ముగ్గులు వేసి వాటిపై గొబ్బెమ్మలు ఉంచారు. గ్రామాలు బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులతో సందడిగా మారాయి.

పెద్దఅడిశర్లపల్లి: సంక్రాంతి సందర్భంగా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద చిన్నారులకు గాలిపటాల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా వారికి బహుమతులు అందజేశారు.

డిండి: సంక్రాంతి వేడుకలు మండల ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటి ఎదుట వేసిన రంగురంగుల ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయి.


పెద్దఅడిశర్లపల్లి: గాలిపటాల పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

అలరించిన ముగ్గుల పోటీలు

మిర్యాలగూడ: సంక్రాంతి పండుగ సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని వాసవీనగర్ కాలనీలో కాలనీ అధ్యక్షుడు కొనకంచి వీరరాఘవులు ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మట్టయ్య, గోవర్ధన్, కరుణాకర్, శ్రీధర్‌రెడ్డి, మల్లేష్, యాదగిరిరెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా దామరచర్ల మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మాజీ సర్పంచ్ బంటు కిరణ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్యామ్‌సుందర్‌రెడ్డి, జనార్దన్, నరసింహారెడ్డి, మన్నెం నాగయ్య, అన్నెం కరుణాకర్‌రెడ్డి, అయోధ్య రాంరెడ్డి, బారెడ్డి గోవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మిర్యాలగూడ అర్బన్: ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

దొండవారిగూడెంలో ముగ్గుల పోటీలు

మిర్యాలగూడ అర్బన్: మండలంలోని దొండవారిగూడెం గ్రామంలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 285మంది మహిళలు పాల్గొనగా ఏడుగురికి ఉత్తమ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు గుండు నరేందర్‌గౌడ్, నాయకులు లింగంపల్లి వెంకన్న, శ్రీనివాస్, తలకోల వెంకట్‌రెడ్డి, మధు, సైదులు, లక్ష్మయ్య, బలరాములు, చంద్రు, ఏడుకొండలు పాల్గొన్నారు.

త్రిపురారం: నిడమనూరు, త్రిపురారం మండలాల్లోని పలు గ్రామాల్లో ముగ్గులు, కబడ్డీ, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు.


త్రిపురారం: కంపాలపల్లిలో ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న గ్రామస్తులు


దామరచర్లలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి


బహుమతులు అందజేస్తున్న లక్ష్మీనారాయణ

పెద్దవూర: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం పెద్దవూర మండలంలోని చింతపల్లి గ్రామంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా (ఐద్వా) ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన ఎడారి ధరణి, ద్వితీయ బహుమతి పొందిన బొమ్మపాటి వరలక్ష్మి, తృతీయ బహుమతి సాధించిన నవ్య, ప్రత్యేక బహుమతులను మహేశ్వరి, నిహారికలకు అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి కారంపూడి ధనలక్ష్మి, బొంగరాల జంగయ్య, బోడ అంజయ్య, పీరయ్య, జానయ్య, సైదులు, రవి, నరేందర్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నల్లగొండ: పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను నల్లగొండ పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, ఎండీ మహమూద్, సోలిపురం శంభురెడ్డి, పోతపాక సహదేవ, ఎస్‌కె. గౌస్, బొజ్జ నాగరాజు, పెరిక నరసింహ, కొమ్మనబోయిన మల్లయ్య, డి.యాదయ్య, గాదపాక వీరయ్య, జీడిమడ్ల యాదయ్య, కొండా రాములు, సీహెచ్ మహేష్, ఆర్.కిరణ్‌కుమార్, వజ్జ నరసింహ, పోతెపాక యాదయ్య, బోడ సోములు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గుమ్ముల మోహన్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

అర్హుల జాబితా రూపొందించాలి

డిండి: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అర్హుల జాబితాను గడువులోగా రూపొందించి ఉన్నతాధికారులకు పంపించాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం డిండి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాల్‌లో రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్లు, ఏఈఓలు, గ్రామకార్యదర్శులతో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల అర్హుల ఎంపికపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక గురువారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ వెంకన్న, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీఓ రమణారెడ్డి